


# లాస్ట్ స్టోరీ

కంఠంనేని రాధాకృష్ణమూర్తి

రిసీవరు చేతిలోకి తీసుకుని డయల్ చేశాడతను.

అవతల రింగవుతోంది కాని ఎవరూ ఫోనెత్తటంలేదు!

ఫోన్ కట్ చేసి కొద్దిసేపయాక అతను మళ్ళీ డయల్ చేశాడు.

ఈసారి అవతల ఫోన్‌ను తీసుకున్న చప్పుడయింది.

"హలో!"

ఆ స్వరాన్ని గుర్తుపట్టాడు.

"ల-లక్ష్మీ" తడబడుతూ అన్నాడు.

"అవును. లక్ష్మిని- మీరు?"

"కీర్తిని!"

"........."

"లక్ష్మీ"

"వింటున్నాను."

"తార ఉందా ఇంట్లో?"

"ఉంది. నిద్రపోతోంది."

"ఇవాళ నా పుట్టినరోజు."

"గుర్తుంది."

'ఎంత పల్లవిరుపుగా మాట్లాడుతోంది!' అనుకున్నా డతను.

"ప్రతిఏటా ఈ రోజున తార నాకు స్వీట్లు తీసుకువస్తుంది. తన చేతితో నా నోటికందించి, నా చేతితో అందించిన స్వీటును తను తింటుంది. ఇవాళ తారను ఎందుకు పంపలేదు?"

"ఏనాడూ నేను తారను మీ వద్దకు వెళ్ళమంటూ పంపలేదు. ఇవాళ వద్దని ఆపనూ లేదు..."

"మరి?"

"దానికి గుర్తులేదనుకుంటాను, మీ వద్దకు వెళ్ళొస్తానని అనలేదు. నేను కూడా గుర్తుచేయలేదు."

"అంటే ప్రేక్షకులతోపాటు నా కూతురు కూడా నన్ను మర్చిపోతోం దన్నమాట!"

"కావచ్చు."

"పోనీ నువ్వన్నా గుర్తుచేయ కూడదా!"

"నేనా...నేనెందుకు గుర్తుచేయాలి? దానికి మీరు గుర్తులేదంటే మీమీద ప్రేమపోయి ఉండాలి. దానికి మీమీద నుంచి జారిపోతున్న ప్రేమను నేనెందుకు ఎగదొయ్యాలి? నాకేం పని? నా కిప్పుడు మీరేమవుతారని?"

అతని గుండెల్లో గునపం దిగేసి అటూ ఇటూ తిప్పినట్లయింది.

"లక్ష్మీ, దయచేసి అంత కఠినంగా మాట్లాడకు." దీనంగా అన్నాడు.

"ఒకప్పుడు మీరు నాతో అంతకంటే కఠినంగానే మాట్లాడారు."

"అవునవును," చిన్నగా గొణిగాడు.

అతనికి ఇంకా గుర్తుంది. అప్పట్లో తను పూర్తిగా జయ మోజులో ఉన్నాడు భార్యగా ఈమెను నిర్లక్ష్యం చేసాడు. తన హక్కుకోసం ఈమె వాదన పెట్టు కున్నప్పుడు నానా దుర్భాషలాడేవాడు. తనే మర్చిపోలేదు, ఇంక ఆమె యెట్లా మర్చిపోగలుగుతుంది!?"

"నన్ను క్షమించు లక్ష్మీ!!"

"ఎందుకు నన్ను మాటిమాటికీ అలా పేరుతో పిలుస్తారు? అలా పిలిచే హక్కు మీ కిప్పుడు లేదు."

"లక్ష్మీ! లక్ష్మీ!!"

పైకి అనలేదతను. లోలోపల గింజు కున్నాడు,

నిజమే తనకిప్పుడా హక్కు లేదు. ఏడేళ్ళనాడు-విడాకు లిచ్చేసినప్పుడే ఆ హక్కును కోల్పోయాడు కూతురు తార మీద కూడా. తనకిప్పుడు ఏ హక్కులూ లేవు. తార ఆమెకే చెందాలని కోర్టు తీర్పు నిచ్చింది.

"లక్ష్మీ," అతను మళ్ళీ అన్నాడు. "ఇప్పుడు నేను చచ్చినపాములాంటి వాణ్ణి. మళ్ళీ మళ్ళీ చంపకు నన్ను.. దయచేసి తారను ఒకసారి ఇక్కడకు పంపవూ?"


"ఇప్పుడా-ఇంత రాత్రివేళా??"

"అవును ఇప్పుడే. నేను చాలా వంటరితనాన్ని ఫీలవుతున్నాను. నా చిట్టి తల్లి వొడిలో తలదాచుకుని సేదతీరాలి.."

"సారీ! తారను నేనిప్పుడు పంపలేను"

అతని గుండెల్లో బాధ సుడులుతిరుగు తోంది. ఆమె తనను 'అండీ' అనికూడ సంబోధించటం లేదు. ముభావంగా పుల్ల విరుపుగా మాట్లాడుతోంది.

తన నిస్సహాయత్వం అతనికి కొట్ట వచ్చినట్లుగా కనిపించసాగింది. గుండె ల్లోంచి దుఃఖం పొంగిపొర్లుకుంటూ పైకి ఉబుకు వస్తోంది. గొంతుకదాకా వచ్చాక అది అక్కడ ముద్దకట్టుకుపోయినట్లయి గొంతు బరువుగాను, నొప్పిగాను అనిపి స్తోంది. అతనిలోని స్వాభిమానం సడల సాగింది. మాటిమాటికీ గుటకలు మింగ సాగాడు




సడన్‌గా అతనిలోని బింకమంతా చెల్లాచెదరయింది.

"లక్ష్మి లక్ష్మి." గబగబా అన్నాడతను. "పోనీ నువ్వొకసారి రాగలవా?" అతని స్వరంలో సంశయం స్పష్టంగా తెలుస్తోంది.

"నేనా? నే నెందుకు??"

ఊహించి ఉండదామె ఆ పరిణామాన్ని—ఆమె స్వరం ఆశ్చర్యంగా ధ్వనించింది.

"అవును నువ్వే లక్ష్మి! నేనిప్పుడు చాలా ఒంటరివాణ్ణి. సర్వనాశనం అయిపోయాను. నా తప్పులన్నింటినీ మన్నించు. నా వద్దకు తిరిగి వచ్చేయి. తారనూ నిన్నూ చూసుకుంటూ బ్రతుకుతాను. నాకు అండగా నిలువు లక్ష్మి! నాకు కొత్త జీవితాన్ని ప్రసాదించు...నువ్వు తప్ప నన్నిప్పుడు ఆదుకునేవారెవ్వరూ లేరు. నువ్వుకూడా కాదంటే నేనిక చచ్చిపోతాను. నాకు అంతకంటే గత్యంతరం లేదు. లక్ష్మి...లక్ష్మి.."

కొద్దిక్షణాలపాటు ఆమె అవాక్కయిపోయినట్లు కనిపించింది. తర్వాత ఒక నిశ్చయానికి వచ్చినదానిలా అన్నది:

"చూడండీ, ఒకప్పుడు నేనూ ఇలాగే మిమ్మల్ని అభ్యర్థించాను. దేబిరించాను! అయితే అదంతా నా తప్పనేది ఏమీ లేకుండానే. అదీ దారుణమైన విషయం! నా ఎదురుగానే మీరు త్రాగి ఆ జయతో తృళ్ళుతుంటే భార్యగా భరించలేక వద్దన్నాను. అది మంచిది కాదన్నాను. అదే కదా అప్పట్లో నేను చేసిన తప్పు! మీరు వినిపించుకోలేదు. నన్ను నానా తిట్లు తిట్టేవారు. ఒకో సమయాన చెయ్యి చేసుకునేవారు. ఆఖరికి నా ఎదురుగానే దాన్తో కలిసి గదిలోకిపోయి తలుపులు వేసు

ఉంటే, ఇవతల నా గదిలో కూర్చుని విశ్శబ్దంగా రోదించేదాన్ని. ఇదే కదా నా తప్పు అప్పట్లో! చివరికి భరించలేక మీ సినీలోకంలో గౌరవనీయుడుగా చెలామణీ అవుతున్న కాంతయ్యగారికి కబురు చేసి మిమ్మల్ని అడిగిపించాను. మీకు కోపం వచ్చింది. ఆ రాత్రి నన్ను జుట్టు పట్టుకుని కొట్టారు గుర్తుందా? ఆదర్శాలు, సంస్కరణ, ఉద్ధరించటంలాంటి కబుర్లతో ప్రేక్షకుల్ని ఉత్తేజింపజేసే మీరు!! ఇక ఆ తర్వాత-మీరు కోర్టుకు పోతానన్నరోజు గుర్తుందా-మీ కాళ్ళు పట్టుకున్నాను. జయతో ఆ ఇంట్లోనే సరాగాలాడినా ఫరవాలేదు, నన్ను మాత్రం ఓ మూల ఉండనివ్వమని బతిమాలుకున్నాను. మీరు వినలేదు. కాలితో తన్నేశారు నన్ను. వెండితెరమీద హీరోగారు వాస్తవ జీవితంలో విలన్‌లా తన్నారు నన్ను. అప్పుడు తారకు మూడేళ్ళు. గుర్తుందా కీర్తికుమార్‌గారూ..."

"గుర్తుంది గుర్తుంది," మూలిగాడు కీర్తి.

అతనికి గొంతు మరీ బరువుగా, మరీ నొప్పిగా అనిపించసాగింది. కళ్ళలోంచి నీళ్ళు చుక్కలుచుక్కలుగా జారసాగాయి. కుడి కంటినుంచి కారుతున్న చుక్కలు కుడి చేతిలో పట్టుకున్న మౌత్‌పీసును తడుపుతున్నాయి.

"ఇవాళ తమరి జయజాణ వేరేవాళ్ళతో తిరుగుతోందన్న సంగతి నాకూ తెలుసు" దృఢస్వరంతో ఆమె మళ్ళీ మాట్లాడసాగింది. "ఆమె వేరేవాళ్ళ వద్దకు వెళ్ళిపోగానే మీకు పాపం పాతభార్య గుర్తుకు వచ్చింది. 'పాత భార్య' అందోయ్ 'పాత'!! వింటున్నారా కీర్తికుమార్‌గారూ ...జయను అవతలివాడు వదిలిపెట్టేయగానే ఆమె మళ్ళీ మీ వద్దకు తిరిగిరావచ్చు. అప్పుడు మళ్ళీ మీకు 'పాత' భార్య 'రోత' అవుతుంది. అవునా..."

కొద్దిసేపు ఆగి ఆమె మళ్ళీ మొదలెట్టింది!

"ఈ చొక్కా తీసేసి మరో చొక్కా తొడుక్కున్నట్లుగా జంటల్ని మారుస్తుండే మీబోటి గ్లామరారణ్య జంతువులకు మన సమాజం సృష్టించిన నీతి నియమాలు, వివాహ వ్యవస్థలోని పవిత్రత, భార్యపట్ల బాధ్యతలు లాంటివేమీ అక్కర్లేదు సార్. మీ వద్దకు నేను తిరిగి వచ్చేస్తే కొన్నాళ్ళకు అవకాశాలు కలిసిరాగానే తమరు మళ్ళీ పాతపాట పాడరన్న నమ్మకంలేదు. కాబట్టి మహాశయా, ఇంకెప్పుడూ నా జోలికిగానీ, తార జోలికి గానీ రాకండి. వింటున్నారా??"

అవతలివేపున ఫోను పెట్టేసిన శబ్దం వినిపించటంతో నిట్టూరుస్తూ అతనుకూడా రిసీవరును క్రెడిల్ మీద పెట్టాడు.

సమయంచూసి ఆమె తన కసినంతా తీర్చుకున్నదని అర్థమయిందతనికి.

టైము చూసాడు. రెండు!



మనస్సంతా బాధతో, బరువుతో శరీరం క్రిందికి కృంగిపోతున్నట్లుగా అనిపించసాగిం దతనికి.

కొద్దిసేపు గదిలో అటూ ఇటూ పచార్లు చేసాడు.

ఎంత వంటరితనం! ఎంత నిరాశ!!

వాటిని తను భరించలేడనిపించింది.

పక్క గదికిపోయి మంచంమీద పడ్డాడు.

అటు దొర్లాడు. ఇటు దొర్లాడు. ఎంతకీ నిద్రపట్టటం లేదు. కంట్లో నరాలన్నీ లాగి పెడుతున్నట్లుగా గుంజుతున్నాయి. ముఖ్యంగా కళ్ళవద్ద.

జయ ఏం చేస్తుంటుందిప్పుడు?

భాస్కర్ పక్కనే- మంచంమీద- గుండ్రటి మొహం- పాలరాతి దేహం- చిలిపి నోరు-నిద్రపోతోందా? లేక ఇంకా శృంగార క్రీడలో పొర్లుతోందా? బ్లడీ నింఫోమానియాక్ ...

చటుక్కున అతను లేచి కూర్చున్నాడు. అతని పెదాలు బిగుసుకున్నాయి. పిడికిళ్ళు బిగుసుకున్నాయి. కళ్ళు కసిగా చూసాయి.

మళ్ళీ అంతలోనే మంచంమీదికి వాలిపోయాడు.

నిస్పృహ ఆవరించిందతణ్ణి. లాభం లేదు. తను పూర్తిగా నిస్సహాయుడు, నిర్భాగ్యుడు. ఏమీ చేయలేడు. అంతా తన చేయి దాటిపోయింది. యాడవటం తప్ప చేయగల్గిందేమీ లేదు.

అంతలోనే అతనికి భార్య లక్ష్మి గుర్తుకువచ్చింది. ఇంకెక్కడి భార్య— మాజీ భార్య! కాని మంచిది. సహనశీలి. దయాళువు. తనను కనికరించక పోతుందా? ఇక ఈ సినిమాలోకం వద్దు. ఆమెనూ, తారను తీసుకొని ఇక్కడికి దూరంగా, ఏ పల్లెటూరిలోనో ప్రశాంతంగా జీవితాన్ని గడపాలి. ఈ పేరు ప్రతిష్టలు ఇక్కడి పరువు మర్యాదలూ, ఇవన్నీ నకిలీవి! గాజుబొమ్మలలాంటివి. ఒక్కసారి చెయిజారాయంటే క్రిందపడి పగిలిపోతాయి. ఇంక చేతికి రావు. చెల్లాచెదురవుతాయి . లక్ష్మీ- లక్ష్మీ- నన్ను కాపాడవూ—

గబగబా లేచి వెళ్ళి అతను ఫోనును మళ్ళీ చేతిలోకి తీసుకున్నాడు. లక్ష్మి నంబరుకు రింగ్‌చేసాడు. అతని చేతులు వణుకుతున్నాయి. మనస్సంతా ఉద్వేగంతో నిండిపోయి ఉంది.

ఒకసారి–అవతల ఎవరూ ఎత్తలేదు.

మరోసారి–ఇంకా ఎత్తలేదు.

మూడోసారి–

"హలో..." నిద్రమత్తులో విసుక్కుంటూ ధ్వనించింది అవతలి గొంతు.

"నేను లక్ష్మీ-కీర్తిని!"

ఒక్కక్షణం నిశ్శబ్దం. తర్వాత ఆమె స్వరం కోపంగా వినిపించింది.


"చూడండీ, ఇప్పుడు తెల్లవారుఝామున మూడు అయింది. మీరిలా అర్ధరాత్రి అపరాత్రి అని లేకుండా ఫోనులు చేస్తుంటే ఎలా ??"

"లక్ష్మీ-లక్ష్మీ— అలా మాట్లాడకు. నాకు నిద్రపట్టటం లేదు, నేను..."

"మీకు నిద్రపట్టకపోతే నన్నేం చేయమంటారు?" మధ్యలో అడ్డుకుందామె. "నేను కూడా నిద్రపోవద్దంటారా? ఇంకోసారి కనక మళ్ళీ ఫోనుచేసారంటే పోలీసు రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుంది... ఎవరు చేసిన పాపానికి వాళ్ళు ఫలితం అనుభవించాలి..." గొణుగుతూ ఆమె ఫోను పెట్టేసింది.

కుప్పలా కూలిపోయాడు కీర్తికుమార్. అతని మనస్సునిండా ఎవరో దేవుతున్నట్లుగా ఉంది, సుళ్ళుసుళ్ళుగా తిరుగుతున్న బాధను ఎలా తగ్గించుకోవాలో అర్థం కావటంలేదు. అక్కణ్ణించి ఎటన్నా పారిపోవాలనిపించింది. పారిపోయినా తగ్గుతుందా? మనస్సులోని ఆ బాధ తగ్గేదాకా పిచ్చిగా అటూఇటూ పరుగులు తీయాలనిపించింది. పిచ్చెక్కబోతుందా తనకు??

సడన్‌గా అతను చేతుల్లో మొహాన్ని




దాచుకుని యేడవసాగాడు. కాసేపున్నాక ఆ ఏడుపు వెక్కిళ్ళలోకి మారింది.

"లక్ష్మి-లక్ష్మి-తారా-జయా" పలవరించసాగాడు.

ఆఖరికి అతడు ఏగ్జాస్ట్ అయిపోయాడు.

లేచి గ్లాసుతో మంచినీళ్ళు తీసుకున్నాడు.

అల్మారా వద్దకెళ్ళి టాబ్లెట్స్ చేతిలోకి తీసుకున్నాడు.

కసిగా ఒక్కొక్క టాబ్లెట్ నీ నోటిలో వేసుకుంటూ, ఒకో గుక్క నీళ్ళుతాగుతూ గ్లాసులో నీళ్ళన్నీ ఖాళీచేసాడు.

అప్పటికి ఉదయం నాలుగయింది,

తర్వాత అతను వెళ్ళి మంచంమీద వెల్లకిలా పండుకున్నాడు. అతని చేతులు ఎడమెడంగా చాచుకున్నాయి.

"గుడ్ బై జయా!" అప్రయత్నంగా అతని నోటిలోంచి మాటలు వెలువడ్డాయి,

విచిత్రమేమిటంటే అతను "గుడ్ బై లక్ష్మి" అని అనలేదు!!